క్లుప్తంగా

పథకాలను సద్వినియోగం చేసుకోండి



నూతన గ్రూపులుగా ఏర్పాటైన మహిళలు

నారాయణఖేడ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా టీఎంసీ అనిత, వివిధ బ్యాంకుల మేనేజర్లు కోరారు. శుక్రవారం ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా లేని మహిళలను గుర్తించి 10 మంది మహిళలతో ఒక్కో గ్రూపు చొప్పున పలు గ్రూపులను ఏర్పాటు చేసి వారితో బ్యాంకు ఖాతాలను తీశారు. వృత్తి వ్యాపారాలు చేసే పురుషులతో సైతం వీధి వ్యాపారులు, దివ్యాంగుల గ్రూపులను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు మెప్మా టీఎంసీ తెలిపారు. స్వనిధి, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా అందించే రుణాలను గురించి వివరిస్తూ మహిళలకు అవగాహన కల్పించారు.

మొక్కలు నాటి సంరక్షించండి



మొక్కలు నాటుతున్న అధికారులు

నారాయణఖేడ్: ఈ వర్షాకాలంలో ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని నిజాంపేట్ ఎంపీడీఓ సంగ్రాం, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.సంధ్యారాణి తెలిపారు. నిజాంపేట్ పీహెచ్‌సీ, ఎంపీడీఓ తదితర కార్యాలయాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లు, పరిసరాలు, ఆవరణలో మొక్కలు నాటాలని సూచించారు. వైద్యాధికారి డా.తరణి, పీహెచ్‌సీ, ఎంపీడీఓ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మ కమలం



హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం చింతల్చెరులో బ్రహ్మ కమలం పువ్వులు వికసించాయి. గ్రామానికి చెందిన మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు గున్నాల నర్సింలు ఇంట్లో గురువారం రాత్రి బ్రహ్మకమలం పువ్వులు మూడు వికసించడంతో ఆయన కుటుంబసభ్యులు వాటికి పూజలు చేశారు.

క్యాలెండర్ ప్రకారమే బోధించాలి

ఎంఈఓ మాణయ్య



డ్రైవర్స్ కాలనీలోని పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ మాణయ్య

జహీరాబాద్ టౌన్: విద్యార్థులకు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం బోధిస్తూ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఎంఈఓ మాణయ్య పేర్కొన్నారు. పట్టణంలోని రైల్వే కాలనీ, రాంనగర్, డ్రైవర్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యాప్రమాణాలను మెరుగుపరిచేందుకు పాఠశాల స్థాయిలోనే కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్

సదాశివపేట(సంగారెడ్డి): అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ, నిరుద్యోగ జేఏసీ నాయకులను అదుపులోకి తీసుకుని సొంత పూచికత్తుపై విడుదల చేశారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో డీవైఎఫ్ఐ, నిరుద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన చలో హైదరాబాద్ సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి వెళ్లనివ్వకుండా గురువారం అర్ధరాత్రి నుంచే నాయకులను అరెస్టు చేశారు. ఈ అరెస్టులను అనిల్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన యూత్ డిక్లరేషన్ అమలు చేయాలన్నారు. ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్‌లను విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి నెలకు రూ 4వేలు ఇవ్వాలని, రాజీవ్ యువ వికాస్‌స్కీమ్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు.

వణికిస్తున్న గ్రామసింహాలు

- వాహనదారులకు, పాదచారులకు వెంబడిస్తున్న కుక్కలు
- భయపడుతున్న చిన్నారులు
- అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



సంగారెడ్డి పట్టణంలో సంచరిస్తున్న కుక్కలు

సంగారెడ్డిటౌన్: జిల్లాలో కుక్కల బెడద ఎక్కువైంది. జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట కుక్కకాటు బాధితులు ఆస్పత్రుల పాలవుతున్నారు. కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడం, అవి కరుస్తుండటంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. రాత్రివేళలో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో రద్దీ ప్రాంతాలు, రహదారులపై గుంపులుగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళ రోడ్లపై ఉంటూ ద్విచక్ర వాహనదారులు, పాదచారులను వెంబడిస్తున్నాయి. కొందరు వీటి కాటుకు గురవుతుండగా మరికొందరు వాహనాలపై నుంచి పడి గాయాల పాలవుతున్నారు. ఉదయం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు వీధులలో చెత్త ఉండటంతో అక్కడ ఉన్న కుక్కలు దారి వెంట వెళ్లే పిల్లలపై దాడి చేస్తున్నాయి. దీంతో వీధి కుక్కలతో ప్రజలు వణికిపోతున్నారు. మరికొన్ని చోట్ల ద్విచక్ర వాహనాలను వెంబడిస్తూ ఒంట్లో వణుకుపుట్టిస్తున్నాయి. కుక్కలకు శస్త్ర చికిత్సల పేరిట ఏటా నిధులు ఖర్చు చేస్తున్నా వాటి సంఖ్య తగ్గుముఖం పట్టడం లేదు. జిల్లాలో సుమారు 80 వేల వరకు కుక్కలు ఉంటాయని అధికారులు చెబుతున్నప్పటికీ స్థానిక సంస్థలలో సిబ్బంది కొరతవల్ల కుక్కల నియంత్రణపై దృష్టి సారించలేకపోతున్నట్లు కొంతమంది అధికారులు చెబుతున్నారు. కుక్కలను పట్టి తీసుకెళ్లే వాహనాలు సైతం జిల్లాలో అరకొరగా ఉన్నాయి. ప్రతీ నాలుగు నెలలకు ఒకసారి వీటికి యాంటీ రేబిస్ టీకాలు వేయాలి. కానీ ఈ ప్రక్రియ సక్రమంగా జరగకపోవడంతో జిల్లాలో కుక్కల సంఖ్య పెరుగుతోంది. సంగారెడ్డికి సంబంధించి కుక్కల నియంత్రణ కేంద్రాన్ని కాశీపూర్ సమీపంలో ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా రూ.లక్షల్లో ఖర్చు చేసి కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఇక కుక్కల బెడద తగ్గించడానికి అవసరమైన నిధులు కేటాయింపులు జరగడం లేదనేది మరో వాదన వినిపిస్తున్నారు. వెంటనే సంగారెడ్డి పట్టణంతో పాటు జిల్లాలో కుక్కల నియంత్రణకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టి రక్షించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

నేడు కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బ్లూక్రాస్ సొసైటి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్ నిర్వహించనున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఉమ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలను వ్యాక్సినేషన్ వేయించుకోవాలని, అదేవిధంగా పట్టణ పరిధిలోని వీధి కుక్కలకు కూడా వ్యాక్సినేషన్ వేయిస్తామని చెప్పారు.

రోడ్డుపై నడుస్తుంటే వెంట పడుతున్నాయి



మా వార్డులో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కాలేజీకి వెళ్తుంటే రోడ్లపై వెంట పడుతున్నాయి. భయం భయంతో వెళ్లాల్సి వస్తుంది. మున్సిపల్ వాళ్ళు వెంటనే స్పందించి మా కాలనీలో కుక్కలను పట్టుకోవాలి.

లద్దు జాదవ్ విద్యార్థి

చర్యలు తీసుకుంటాం



కుక్కల సంతానోత్పత్తిని తగ్గించేందుకు చర్యలు చేపడతాం. వీధి కుక్కలు పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తాం.

డాక్టర్ వసంతకుమారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

బకాయిలను వెంటనే విడుదల చేయాలి

పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులకు రావలసిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్ యూ(ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం)జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలల బంద్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ...రాష్ట్రంలో మూడేళ్ల నుంచి విద్యార్థులకు రావలసిన ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో పెట్టడం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకుపడుతున్నారని తెలిపారు. విద్యార్థులు పై చదువులు చదవాలంటే కార్పొరేట్ కళాశాలలోని ఫీజులు కట్టాలని యాజమాన్యం ఒత్తిడి గురి చేయడంతో విద్యార్థులు చదువు మానేసి పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి



సంగారెడ్డి టౌన్ : రైతు వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

సంగారెడ్డి టౌన్ : ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులందరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఝాన్సీ స్పష్టం చేశారు. సంగారెడ్డి మండలంలోని కొత్లాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఫార్మర్ రిజిస్ట్రీ

నారాయణఖేడ్: ఆధార్‌తో ప్రతీ రైతుకు గుర్తింపు ఇచ్చి యూనిక్ కోడ్‌ను కేటాయించడం, రైతులకు గుర్తింపు కార్డు జారీ ప్రక్రియ నియోజకవర్గంలో ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా నాగల్‌గిద్ద మండలంలోని ఏస్గి, దామర్‌గిద్ద, గోందెగదాం గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను శుక్రవారం నిర్వహించారు. ఏఈవోలు సావిత్రి, సంతోష్, మహిపాల్ రైతుల వివరాలు నమోదు చేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వ్యవసాయ అధికారి ప్రవీణ్‌చారి పర్యవేక్షించారు.

ప్రతీ రైతుకు ఫార్మర్ యూనీకోడ్ తప్పనిసరి

కంగ్టి(నారాయణఖేడ్): ఆధార్ గుర్తింపు కార్డు తరహాలోనే ప్రతీ రైతుకు ఫార్మర్ యూనీకోడ్ తప్పనిసరని కంగ్టి మండల వ్యవసాయాధికారి హరీశ్ పవార్ తెలిపారు. మండలంలోని రాజారాం తండాలో శుక్రవారం ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయ రంగాన్ని పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ శాఖా రికార్డుల ఆధారంగా భూ యాజమాన్య వివరాల ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేయడంతో ఈ ఫార్మర్ ఐడీ కేటాయించడం జరుగుతోందన్నారు.

ఐటీసీలో బీఆర్‌టీయూ ఘనవిజయం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామికవాడలోని ఐటీసీ పరిశ్రమలో శుక్రవారం జరిగిన ఎన్నికల్లో బీఆర్‌టీయూ ఘన విజయం సాధించింది. మొత్తం 74 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్‌టీయూ అభ్యర్థి రాంబాబు యాదవ్‌కు 37 ఓట్లు రాగా, ఐఎన్‌టీయూసీ అభ్యర్థి సంజీవరావుకు 36, స్వతంత్ర అభ్యర్థి అశ్వక్ హుస్సేన్‌కు కేవలం ఒక్క ఓటు వచ్చింది. దీంతో ఒక ఓటు ఆధిక్యంతో బీఆర్‌టీయూ అభ్యర్థి రాంబాబు యాదవ్ ఘనవిజయం సాధించారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎస్ రెడ్డి, యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



సంబరాల్లో బీఆర్‌టీయూ నాయకులు, కార్మికులు

బోరుబావి తవ్వకం పనులు ప్రారంభం

మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చింతా గోపాల్

సదాశివపేట(సంగారెడ్డి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సహాయ సహకారాలతో తన వంతు కృషి చేస్తానని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ పేర్కొన్నారు. పట్టణంలోని 16వ వార్డులో శుక్రవారం మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులు రూ.1.60 లక్షల వ్యయంతో మంచినీటి సమస్యల పరిష్కారానికి బోరుబావి తవ్వకం పనులను మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బోరుబావి తవ్వకం ద్వారా వార్డులో కొంతమేరకు మంచినీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు విద్యాసాగర్‌రెడ్డి, ప్రకాష్, ఇంద్ర మోహన్‌గౌడ్, ఆకుల శివ, మాజీ కౌన్సిలర్ కొత్తగొల్ల కృష్ణ, నాయకులు వీరేశం, బరాడి శివ, శమీ, కిరణ్, ఖాజా పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సమ్మె నోటీసు

వట్‌పల్లి(అందోల్): కార్మికులకు హాని కలిగించే లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని కోరుతూ జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని తహసీల్దార్ శ్రీనివాస్‌కు కార్మికులు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి డి.విద్యసాగర్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడ రోడ్లు అధ్వానం



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలోని పారిశ్రామికవాడ రోడ్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. ఐడీసీ మార్గంలో రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి వరదనీరు చేరింది. ఈ దారి గుండా ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో ప్రయాణించాలంటే కార్మికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు, కార్మికులు కోరుతున్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో సీటు



హారిక

మునిపల్లి(అందోల్): మండల కేంద్రమైన మునిపల్లి ఉన్నత పాఠశాలలో చదివిన హారిక బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ఉపాధ్యాయులు శుక్రవారం తెలిపారు. దీంతో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హారికకు అభినందనలు తెలియజేశారు.

దోమల నివారణకు చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పట్టణ పరిధిలోని 19వ వార్డు పోచమ్మబస్తీలో ఫాగింగ్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ కిషోర్ పరిశీలించారు. ఇళ్ల మధ్య, ఖాళీ స్థలాల్లో చెత్తా చెదారాలు వేయకుండా మున్సిపల్ వాహనాల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణ అందరి బాధ్యత

పటాన్‌చెరు టౌన్: దోమల నివారణ అందరి బాధ్యత అని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో నిర్వహించిన దోమల నివారణ అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్పందన, జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ ఏఈ తిరుపతి, సూపర్ వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అభయ హస్తం అమలు చేయండి

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్

నారాయణఖేడ్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ దళిత కుటుంబాలకు అంబేడ్కర్ అభయ హస్తం ద్వారా రూ.12లక్షలు ఇస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్ డిమాండ్ చేశారు. ఖేడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా పథకం అమలు చేయడంలేదన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం యూనిట్లను కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 10న సంగారెడ్డిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, సామాజిక న్యాయానికి ఎదురవుతున్న సవాళ్లపై సెమినార్ నిర్వహించనున్నట్లు చెప్పారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు, సంతోష్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గణపతి, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బి.కాన్షీరాం, సీఐటీయూ జిల్లా నాయకులు రమేశ్, అంబేడ్కర్, పూలే సమితి డివిజన్ అధ్యక్షుడు నర్సింహులు, శివానంద్, కేవీపీఎస్ నాయకులు అరుణ్, మోహన్, విజయ్, సురేశ్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం బోర్డులేవి..?



సమాచార హక్కు చట్టం బోర్డు లేని తహసీల్దారు కార్యాలయం

వట్‌పల్లి(అందోల్): సమాచార హక్కు చట్టానికి అధికార యంత్రాంగం తూట్లు పొడుస్తోంది. సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సామాన్యులు చట్టానికి లోబడి ఏ సమాచారం అయినా పొందే అవకాశం కల్పించింది. ఈ చట్టంలో భాగంగానే అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉండగా...మండల కార్యాలయాల్లో అటువంటి దాఖలాలేవీ కనిపించడం లేదు. ఇక బోర్డులలో పౌర సమాచార అధికారి, సహాయ అధికారి, అప్పిలేట్ అధికారి పేర్లతోపాటు వారి ఫోన్ నంబర్లు ముద్రించి ఉండాలని చట్టం చెబుతుంది. కానీ వట్‌పల్లి మండలంలోని ఒకటి రెండు శాఖలు మినహాయిస్తే అన్ని శాఖలలో సమాచార హక్కు చట్టం బోర్డులు కనిపించడం లేదు. ముఖ్యంగా నిత్యం ప్రజలతో మమేకమయ్యే తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఈ నిబంధనను అధికారులు ఉల్లంఘిస్తూ సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు చేయలేదు. సమాచార చట్టానికి తూట్లు పొడుస్తుండటంపై ప్రజలు తమకు కావాల్సిన సమాచారం పొందేందుకు ఎవరిని అడగాలని ప్రశ్నిస్తున్నారు.

సామరస్యానికి ప్రతీక మొహర్రం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



షర్బత్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: మత సామరస్యానికి, త్యాగనిరతికి మొహర్రం ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మొహర్రం సందర్భంగా ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా శుక్రవారం సాయంత్రం షర్బత్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలో హిందూ ముస్లిం సోదరులు కలిసి నిర్వహించుకునే పండుగ మొహర్రం అన్నారు. ధర్మ పరిరక్షణ, శాంతియుత సమాజ స్థాపన కోసం మహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన ప్రాణత్యాగం నుంచి నేటి సమాజం తెలుసుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అఫ్జల్, వెంకటేశ్, షకీల్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పూరీజగన్నాథ రథయాత్ర



జగన్నాథ రథాన్ని లాగేందుకు దుర్గభవాని మందిరం వద్దకు చేరిన భక్తులు



సదాశివపేట పట్టణంలో జరిగిన జగన్నాథ రథయాత్రలో చిన్నారుల భక్తి విన్యాసాలు

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన పూరీజగన్నాథ రథయాత్ర కనులవిందుగా సాగింది. జగన్నాథుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. పట్టణంలోని దుర్గభవానీ మందిరం నుంచి ప్రారంభమైన రథయాత్ర కుమ్మరికేరి, బుక్కకేరి, గండిమైసమ్మ మందిరం, శాస్త్రీ రోడ్, సిద్దాపూర్‌గాని, సుభాష్‌రోడ్డు, గాంధీచౌక్, కోహీర్‌గాని మీదుగా బసవ సేవా సదన్ ఫంక్షన్ హాల్ వరకు ఈ రథయాత్ర సాగింది. ప్రత్యేక శకటం ఆకట్టుకుంది. జగన్నాథ బలభద్ర సుభద్రలను రథంపై ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి రథాన్ని లాగేందుకు భారీగా తరలి వచ్చారు. హరేరామ హరే కృష్ణ, కృష్ణ, కృష్ణ హరేహరే నామస్మరణతో రథయాత్ర మార్మోగింది. ఇస్కాన్ సభ్యులు భజనలు చేస్తూ నృత్యాలతో ముందుకు సాగారు. రాత్రి 7 నుంచి పది గంటల వరకు ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో కృష్ణ ప్రవచనాలు, నృత్యాలు భజనలు చేశారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు



మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): పేద, మధ్య తరగతి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గడ్డపోతారం పట్టణ పరిధిలోని వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోట్రిక్స్ పరిశ్రమ సహకారంతో రూ. 25 లక్షల నిధులతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, ఇన్‌చార్జి ఎంఈఓ కుమారస్వామి, నాయకులు నవనీత్‌రెడ్డి, రవీందర్, సురేందర్‌రెడ్డి, హెచ్‌ఎం విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పంట రక్షణకు బేదురు బట్ట

మునిపల్లి(అందోల్): అడవి పందుల నుంచి పంటను కాపాడు కోవడానికి రైతులు పెసర పంటలో బట్టలతో బేదురు ఏర్పాటు చేశారు. మండలంలోని పిల్లోడి, తాటిపల్లి శివార్లలోని పెసర పంటలో పంట కాపాడు కోవడానికి శుక్రవారం కొంత మంది రైతులు రక్షణ ఏర్పాటు చేశారు.

◆ గడ్డం నాగేందర్‌కు డాక్టరేట్

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండల పరిధిలోని నేరడిగుంట గ్రామానికి చెందిన గడ్డం నాగేందర్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగంలో పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్‌కు ఎంపికయ్యారు. తెలుగుశాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ చైతన్యం – పత్రికల పాత్ర అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆయన డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. ఉద్యమ వార్తలు, వ్యాసాలు, సంపాదకీయాలు చదవడం ద్వారా ఉద్యమాన్ని అర్థం చేసుకోవడంలో పత్రికల పాత్ర ఎంతో ఉందని గ్రహించి ఈ అంశాన్ని పరిశోధనకు ఎంచుకున్నట్లు చెప్పారు.

◆ విష కీటకాలతో జాగ్రత్త

నారాయణఖేడ్: వానాకాలంలో విష కీటకాలు సంచరించే అవకాశం ఉన్నందున ఇళ్ల చుట్టూ పొదలు లేకుండా చూసుకోవాలని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం కోర్టు కాలనీలో రోడ్ల పక్కన పెరిగిన పొదలను జేసీబీతో తొలగించారు. నిల్వ ఉన్న నీటిని పారబోయించారు.కాలనీల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. పనులను శానిటరీ అధికారి శ్రీనివాస్, కమిషనర్ పర్యవేక్షించారు.